తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వేడుకగా అనంతాళ్వార్ అవతార మహోత్సవాలు



తిరుమల, ఫిబ్రవరి 22(ప్రభాతవార్త ప్రతినిధి:
వైష్ణవ భక్తాగ్రేసరుడు అనంతాళ్వార్ 972వ అవతార మహోత్సవాలు ఆదివారం తిరుమలలో వేడుకగా నిర్వహించారు. అనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని టిటిడి జెఈఓ డాక్టర్ ఎ.శరత్ పేర్కొన్నారు. అనంతాళ్వార్ వంశీకులు శ్రీవారికి పుష్ప కైంకర్యం చేస్తున్నారని, వారి పరంపర ఎల్లప్పటికీ [illegible] ఆకాంక్షి[illegible]ంచారు. పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి ,అనంతాళ్వార్ వంశస్తులు వేంకట కృష్ణ స్వామి,

### తొలిస్వాతంత్ర్య సమయయోధుల్లో
## ఉయ్యాల ఒకరు
### - జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో తొలి స్వతంత్ర్య సమయయోధుల్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఒకరని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వ వర్థంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ 1857 సిపాయిల తిరుగుబాటుకు ముందే 1846-47 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా దక్షిణ భారత దేశంలో ఉయ్యాలవాడ పోరాటం ప్రారంభించారన్నారు. బ్రిటీషు భారీ పన్నుల విధానం, జమిందారీ వ్యవస్థలపై ఉయ్యాలవాడ రైతులు, ప్రజలను ఏకం చేసి పోరాటానికి శ్రీకారం చుట్టారన్నారు. 1846లో ఆయన రాయలసీమలో సాయుధ తిరుగుబాటు ప్రారంభించారని, కొన్ని నెలల పాటు ఉయ్యాల ధైర్యంగా బ్రిటీషు సైన్యంతో యుద్ధం చేశారని, కొన్ని నెలల యుద్ధం అనంతరం బ్రిటీషు వారు ఆయనను పట్టుకుని 1847 ఫిబ్రవరి 22వ తేదీన కోయిలకుంట్ల ప్రాంతంలో ప్రజల ఎదుటే ఉరి వేశారన్నారు. జిల్లా టూరిజం అధికారం నరేంద్రకుమార్, టూరిజం మేనేజర్ గౌరి, కలెక్టరేట్ ఎఓ వాసుదేవన్, తహసిల్దార్లు, అధికారులు, స్థానికనాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# విజయోస్తు... బాలకా...!

**నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం**
**నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ**
**జిల్లాలో 84 పరీక్షా కేంద్రాలు.**
**సీసీకెమెరాల నిఘా నీడలో పరీక్షలు**



తిరుపతి విద్య, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త
జిల్లాలో పరీక్షల సందడి మొదలైంది. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 84 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పరీక్షలకు సుమారు 61వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇప్పటికే పశ్నాపత్రాలు జిల్లాలోని ప్రధాన పోలీస్టేషన్లలో భద్రపరిచారు. ఇన్విజిలేటర్లతో నియామక ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీకెమెరాల ఏర్పాటు చేశారు. 4 ఫ్లైయింగ్, 10 సిటింగ్ స్క్వాడ్లతో పాటు జిల్లా స్థాయి అధికారుల బృందం పరీక్షా కేంద్రాలను పరిశీలించనున్నారు. జిల్లా సమాచారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 72 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు 109 జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలు 84. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు 30,319. సీనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు 30,696 మంది రాయనున్నారు. ఈ ఏడాది నూతన సిలబస్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇంటర్మీడియట్ విద్యామండలి 202526 సంవత్సరానికి ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఎన్సీఈఆర్టీ విధానంలో నూతన సిలబసను ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో ప్రశ్నాపత్రాల రూపకల్పనలోనూ ప్రశ్నల సరళిలోనూ మార్పులు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో పశ్నాపత్రం ఎలా వస్తుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులలో ఆందళన నెలకొంది. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు తొలిరోజు సోమవారం అప్షనల్ లాంగ్వేజ్ పరీక్ష జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 30,319 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా మంగళవారం సెకండ్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 23 వరకు జరగనున్న పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 30,696మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం 84 పరీక్షా కేంద్రాలలో పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పరీక్షా కేంద్రంలోని ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

## సర్వం సిద్ధం



ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాటు పక్కా చేశాం. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలలోనికి అనుమతి ఉండదు. హాల్టికెట్లు ఇప్పటి వరకు అందని వారు వెబ్సైట్ నుంచి నేరుగా డౌన్లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంపులు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. పరీక్ష జరుగుతున్న సమయంలో జిల్లాలోని అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

**తిరుపతి ఆర్ఐఓ జి రాజశేఖర్‌రెడ్డి,**

# నయనానందకరం - శంకరుని శయనోత్సవం



.శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏకాంత సేవ ఉత్సవం దృశ్యం, భక్తజనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి శయనోత్సవంతో ముగిసాయి. ఈ ఉత్సవానికి స్థానిక భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుంచి భక్తుల సేవలందుకున్న స్వామి అమ్మవార్లకు ఈ ఉత్సవం ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నది. ఆలయంలో ఉమాదేవి సమేత చంద్రశేఖర్ స్వామి వెలసిన త్రిశూలానికి.స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అమ్మవారి గర్భగుడిలోని అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ప్రతిష్టించి స్వామి వారి గర్భగుడి వద్దకు తీసుకెళ్ళారు.అక్కడ స్వామి ఉత్సవ మూర్తిని ఉంచి ఉత్సవంగా పళ్ళియార వద్దకు తీసుకెళ్ళారు.ఈ ఉత్సవం సుమారు రెండు గంటల పాటు సాగింది. స్థానికంగా వివాహం అయిన తరువాత కొత్తజంటకు ఏర్పాటు చేసే శోభనంకు తార్కాణంగా నిర్వహించే ఉత్సవం ఏకాంత సేవ.స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం తరువాత నిర్వహించే సంప్రదాయం ఉత్సవం ఏకాంత సేవ. ఈ సేవకు అమ్మవారి గర్భగుడి సమీపంలో ఉన్న శయనమందిరాన్ని చక్కగా అలంకరించారు.ఈ శయనమందిరాన్ని చక్కగా పూలతో ముస్తాబు చేశారు.మందిరాన్ని సువాసనలు వెదజల్లే సుగంధాలు వివిధ రకాల పూల సొభగులతో శోభాయమానంగా తీర్చి దిద్దారు.ఇక్కడ శాస్త్రోక్తంగా పూజలు జరిపారు.విశేష హారతులిచ్చారు.వేదపండితులు వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్, సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, వరదా గురుకుల్,సురేష్ గురుకుల్,రాజేష్ గురుకుల్ ,నీరంజన్ గురుకుల్స్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

**శయన మందిరం ప్రాధాన్యత:**
శ్రీకాళహస్తీశ్వరాలయం వెలసిన అమ్మవారు మహిమాన్వితురాలుగా చెబుతారు.ఇక్కడ అమ్మవారు పరమేశ్వరుని గురించి తపస్సు చేసి జ్ఞానాన్ని పొందారు.కాబట్టి ఈ దివ్యక్షేత్రంలో వెలసిన అమ్మవారు జ్ఞాన ప్రదాయని అని చెబుతారు.ఇక్కడ పక్కనే శయనమందిరం ఏర్పాటు చేశారు. ఇక్కడ భక్తులు సంతానం కోసం ఊయలలు, వివాహం కోసం గాజులు కడతారు. కార్యక్రమంలో ఆలయాధికారులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.ఏర్పాట్లను ఆలయ ఇన్స్పెక్టర్లు సుదర్శనం, వెంకటస్వామి, ఉత్సవాన్ని విజయంతం చేయటానికి భక్తులను కట్టడి చేయటానికి ఆలయంలోని అధికారులు పర్యవేక్షించారు.ఈ కార్యక్రమాల్లో ఎఇఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్‌లు పాల్గొన్నారు.

# తెలుగుదేశంపార్టీకి కార్యకర్తే అధినేత : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి

చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత అని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం నూతన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో పని చేయడం సంతోషంగా వుందని, రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో ఏడు జిల్లాల్లో నూతన పార్టీ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని పార్టీ అధినేత నిర్ణయించడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత అని, పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎంపీలు, ఎమ్మెల్యేలు అందుబాటులో వుండటం కోసం జిల్లా కేంద్రంలో నూతన హంగులతో జిల్లా పార్టీ కార్యాలయంను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ హంగులతో నిర్మించున్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులకు ఒకొక్క గది నిర్మిస్తున్నామన్నారు. అలాగే కార్యకర్తలకు సైతం రాత్రి బస చేయడానికి వీలుగా కార్యాలయ నిర్మాణం వుంటుందన్నారు. ప్రతిపక్ష వైకాపా తన రాజకీయ మనుగడ కోసం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతుందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష వైకాపా తన తీరును మార్చుకుని ప్రభుత్వానికి సహకారం అందించాలన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ క్రమశిక్షణ కల్గిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఈ పార్టీలో కార్యకర్తే అధినేత అని, చిత్తూరులో నిర్మిస్తున్న నూతన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అద్దం పడుతుందన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి మాట్లాడుతూ కార్యకర్త పార్టీకి బలమని, సిఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. చిత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం పార్టీ కుటుంబసభ్యులకు దేవాలయం అన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రప్రకాష్, పెద్ద సంఖ్యలో నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

### గణనాధుని సన్నిధిలో
## కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



కాణిపాకం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
కేంద్ర పౌర విమానమాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలసి ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయం వెలుపల స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆధ్వర ంలో ఘనంగా స్వాగతం పలికారు అనంతరం ఆలయ రాజగోపురం వద్ద ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు,చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్సై నరసింహులు,ఆలయ సూపరెండెంట్ వాసు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి సునీల్‌చౌదరి, ఉపాధ్యక్షుడు నరసింహులు నాయుడు, స్థానిక నాయకులు మదుసూధన్‌రావు, శేషాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో జల్లికట్టు సంబరాలు

## పోటెత్తిన జనసందోహం పోట్లగిత్తలతో పోరాటం
## పలువురికి రక్తగాయాలు .. ఆసుపత్రికి తరలింపు



చంద్రగిరి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
చంద్రగిరిలో తెలుగుతమ్ముళ్ళు జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహించారు. ఏడాదికి ఒకమారు ఏరువాక ముగిశాక పశువులకు పూజలు నిర్వహించి పండుగ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తున్నది. అయితే మారిన ఆధునిక కాలంలో సంక్రాంతి సంబరాల జల్లికట్టును తలచిందే తడవుగా ఎప్పుడైనా జరుపుకోవడం ఇప్పుడు రివాజుగా మారింది. ఇందులో భాగంగా ఆదివారం చంద్రగిరి జల్లికట్టు సంబరాలకు వేధిక అయ్యింది. చంద్రగిరితో పాటు ఇతర మండలాల నుండి యువకులు టాటా ఏస్ వాహనాలలో పెద్దఎత్తున తమ పశువులను చంద్రగికి తీసుకువచ్చారు. అందంగా మలిచిన చెక్కలకు తమ అభిమాన హీరోల ఫోటోలను అతికించి కొమ్ములకు కట్టి పౌరుషంతో రంకెలేస్తున్న పశువులను జనంలోకి వదలిపెట్టారు. పశువుల కొమ్ములకు కట్టిన పట్టీని సొంతం చేసుకోవడాన్ని పౌరుషానికి ప్రతీకగా భావించే యువత పోటెత్తిన ఉత్సాహంతో ముందుకు దూకారు. ఈ క్రమంలో పలువురు యువకులకు రక్తగాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ శిరీషా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది క్షతగాత్రులకు చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, మార్కెట్ యార్డు ఛైర్మన్ గౌస్‌భాషా, సింగిల్‌విండో ఛైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి చంద్రగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ పోతల ప్రవీన్ కుమార్, పనపాకం క్లస్టర్ ఇన్‌చార్జ్ మేడసాని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**-టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ రాకతో యువత జోష్**
టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ రాకతో జల్లికట్టు సంబరాలకు విచ్చేసిన యువతలో జోష్ నింపింది. టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూరి ధనంజయ రెడ్డి, శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పశవుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సంబరాలకు విచ్చేసిన దూరప్రాంత ప్రజలకు వినీల్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాలను చేశారు.

# రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

### - చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



పాకాల, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త
వేగంగా వెళుతున్న రైలులో నుండి జారిపడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పాకాల రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పాకాల - చిత్తూరు రైల్వే మార్గంలోనిపాకాల మండలం చెన్నుగారిపల్లి రైల్వే గేట్ సమీపంలో ఆదివారం ఉదయం ట్రైన్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే గ్యాంగ్ మాన్ అతడిని చూసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని 108 వాహనంలో సమీపంలోని పి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తిరుపతి రైల్వే ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెదవి విరుస్తున్న తెలుగుతమ్ముళ్ళు !

## -పేరుకే పదవులు ఉన్నా ఫలితం సున్నా ! - పలువురు నేతల అంతర్గత ఆవేదన

ప్రభాతవార్త-తిరుపతి:
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో టిడిపి పార్టీలో పదవులు దక్కించుకున్నా సంతోషం లేదనే ఆవేదన పలువురు నేతలు బాహాటంగా అనుచరుల వద్ద పెదవి విరుస్తుండటం ఇప్పుడు గుప్పుమంది. పార్టీలో పేరుకే పదవులు ఉన్నా ఫలితం సున్నాగా మారిందని అంతర్మథనం చెందుతున్నారు. పదవులతో ఖర్చు తప్ప ఆదాయం లేదని,రానున్న మూడేళ్ళలో మళ్ళీ ఎమ్మెల్యే టిక్కెట్టు అయినా వస్తుందా ?కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు వచ్చినా ఆశించిన ఫలితాలు దక్కలేదు అన్న ఆవేదన కొందరు నేతలు అంతర్గత చర్చల్లో వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం తిరుపతిలో టిడిపి జిల్లా పార్టీ కార్యాలయం భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా ఒక నేత మాట్లాడుతూ పార్టీలో ఇలాంటి గాడిద చాకిరీ తప్ప ప్రయోజనం లేదని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. కోట్లు ఖర్చు పెట్టి నామినేటెడ్ పదవితో పాటు పార్టీ పదవి తెచ్చుకున్న తగిన ఆదాయం, గౌరవం దక్కడం లేదనే ఆవేదనలో ఉన్నారు. వర్గ పోరు ముదిరి పోవడంతో తనకు ఎవరూ సహకరించడం లేదని అన్నట్టు



సమాచారం. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్టు వస్తుందన్న ఆశతో ఉన్నానని, అయితే అదీ గ్యారంటీ లేదని తనవాళ్ళతో మాటలోమాట అన్నట్లు తెలుస్తోంది. ఈ పదవుల వల్ల ఒరిగేదేమీ లేదని తెలిసింది. మరో ఇద్దరు రాష్ట్ర నేతలు కూడా మిత్రుల వద్ద ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిసింది. పేరుకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చినా తగిన వనరులు, నిధులు లేవని అంటున్నారు. కాగా తిరుపతిలో అధికారులు ఎవరూ తమ మాటలకు విలువ ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నందున అధికారులు టిడిపి నేతల మాటలను పెద్దగా పట్టించుకోవడం లేదనేది గుసగుసలు. ఎమ్మెల్యే కూడా టిడిపి నాయకులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు కీలక నేతలు నిరాశతో ఉన్నందు వల్ల వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి ఇతర వైసిపి నేతలను సమర్థవంతంగా ఎదుర్కోలేక పోతున్నారు అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే దీని ప్రభావం వచ్చే కార్పొరేషన్ ఎన్నికలపై తీవ్రంగా ఉంటుందనే చర్చ మొదలైంది.

## నెలలో రెండు హ్యాపీ సండేలు

- మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్

**చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**

చిత్తూరు నగర ప్రజలకు ఆహ్లాదకర, ఆనందమయ జీవనం అలవాటు చేయడానికి నెలలో రెండు ఆదివా




రాలు హ్యాపీ సండే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ నిర్ణయం మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాల ఆవరణలో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. ఈ హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగా క్రికెట్, ఇతర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంతమైన సంతోషకర జీవనాన్ని అందించడానికి ప్రతి నెల రెండవ, నాల్గవ శనివారాల్లో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలకసంస్థ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## 24న జిల్లా స్థాయి సైక్లింగ్ క్రీడా పోటీలు

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**

ఈనెల 24వతేది ఉదయం 9గంటలకు చిత్తూరు నగరంలోని మెసానికల్ క్రీడామైదానం నందు జిల్లాస్థాయి సైక్లింగ్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు బి ఉదయ భాస్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీలకు అండర్ 18 వయస్సుకలిగిన వారు మాత్రమే అర్హులని, పోటీలు మెసానికల్ మైదానం నుంచి పివికెయన్ కళాశాల మైదానం వరకు 2 రౌండ్స్ (10కిమీ)వుంటుందనీ, పాల్గొనే అభ్యర్థులు చిత్తూరు జిల్లా వాసి అయివుండి పేర్లను శాప్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఈనెల 28, మార్చి1వ తేది ఎన్టీఆర్ జిల్లా డియస్ఏ నందు జరిగే పోటీలలో పాల్గొనవలసివుంటుందని, ఇతర వివరాలకు సెల్‌నెం. 7396423490ను సంప్రదించాలని కోరారు.

## తిర్లావానిబండలో ఒంటరి ఏనుగు..పంటలపై దాడి

**కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

రామకుప్పం మండలంలో పంటలపై దాడులు చేసిన ఒంటరి ఏనుగు కుప్పం మండలంలో ప్రవేశించింది. కంగుంది పంచాయతీ తిర్లావానిబండ ప్రాంతానికి చేరుకుని అక్కడ రైతులు సాగు చేస్తున్న వరి, రాగి ప ంటలను కొంతమేర ధ్వంసం చేసింది. ఈ ఏనుగును దారి మళ్లించేందుకు అటవీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా మరో ఐదు ఏనుగుల గుంపు ఏకలనత్తం అటవీ ప్రాంతంలో ఉండగా మరో ఒంటరి ఏనుగు తమిళనాడు సరిహద్దు కొండసముద్రం అటవీ ప్రాంతంలో ఉన్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

## కంటి వైద్య శిబిరం విజయవంతం

**పుల్లంపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :**



స్థానిక ఎస్ బి వి డి సభ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివా రం పుష్పగిరి కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో సుమారు వందమం దికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 30 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు 8 మందికి శాస్త్ర చికిత్స కోసం ఆస్పత్రి పంపించి చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు విభిన్న ప్రతిభావంతుల పుల్లంపేట మండల అధ్యక్షుడు మల్లు సుబ్బ నరసారెడ్డి మాట్లాడుతూ కంటి ఆరోగ్యం పై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని కోరారు ఈ కంటి వైద్య శిబిరానికి హాజరైన వారికి దంతు శివయ్య దొంతు శివయ్య భోజన వసతిని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు సునీల్,జస్వంత్ ఆకాష్, క్యాంప్ కోఆర్డినేటర్ మల్లికార్జున రెడ్డి ఉపాధ్యక్షుడు వహీద్ కోశాధికారి నరసింహులు సభ్యులు మురళి నాగార్జున భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ సుమిత్‌కుమార్

***చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:***

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తనతో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిప్యుటీ కలెక్టర్లు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అంది అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

## జనసేన సిద్ధాంతాలు ప్రజల్లో తీసుకెళ్లాలి

- జనసేన కోఆర్డినేటర్ నరేష్

**కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**




జనసేన అధినేత, డిసిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జనసేన కోఆర్డినేటర్ నరేష్ సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉద్యమి సభ్యత్వం సన్నాహక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క జనసేన సాధక్ ఉత్సాహంగా ముందుకు వచ్చి సభ్యత్వాలు చేయించాలని కోరారు. సభ్యత్వం నుంచి నాయకత్వం వైపు మొదటి అడుగు జనసేన ఉద్యమి సభ్యత ్వం అని పేర్కొన్నారు. మార్పు కోసం ఉద్యమించే ప్రతి ఒక్కరూ జనసేన వేదికపై రావాలని కోరారు. ప్రతి ఒక్కరికీ నాయకత్వ అవకాశాలు కల్పించే ఏకైక పార్టీ జనసేన అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వామనమూర్తి, అమీర్, కిషోర్, బాలాజీ, పవన్ మహేష్, పవన్‌కుమార్, సురేష్, పాండు, చంద్రశేఖర్, హంసగిరి, మంజునాథ్, గణేష్, గంగాధర్, సతీష్, కుసుమదివ్య, సరస, హేమ, కాశీ, మునిరాజు, అంజప్ప, నూరుబాషా పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే రాయితీ ఇ - సైకిళ్ల పంపిణీ

**బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



స్థానిక మండల కార్యాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డిచేతుల మీదుగా మహిళలకు రాయితీ ఇ - సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డ్వాక్రా మహిళకు 112.50కోట్ల రూపాయల బ్యాంకు లింకేజ్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలనతో ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వీటిని ఎదుర్కొని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. మహిళా సాధికారత కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ రాజన్న, ఎంపిడిఒ ఉపేంద్ర, తహశీల్దార్ ప్రసన్నకుమార్, టిడిపి మండల అధ ్యక్షుడు కిషోర్ గౌడ్, నేతలు సుబ్రమణ్యంశెట్టి, నాగరాజునాయుడు, భువనచంద్ర గౌడ్, మంజునాథ్, అరుణ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు జయచంద్రచౌదరి మృతి

**తవణంపల్లె, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**



రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, మండల ఆదర్శరైతు జివి.జయచంద్ర చౌదరి(86) శనివారం రాత్రి మృతి చెందారు.శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆయన స్వగ్రామం మండలంలోని జి.గొల్లపల్లెలో కన్నుమూశారు. ఆయన పార్థివదేహానికి జి.గొల్లపల్లె గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడిగా రైతులకు ఉచిత విద్యుత్ కోసం జిల్లా రైతు సమాఖ్య ఆధ్వర్యంలో 1996 సంవత్సరంలో పెద్దఎత్తున జరిగిన ఉద్యమంలో జయచంద్రచౌదరి కీలక పాత్ర పోషించారు. అలాగే చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ ప్రయివేటు పరం కాకుండా న్యాయపోరాటం ద్వారా అడ్డుకోగలిగారు. అలాగే గత నాలుగు దశాబ్దాలుగా రైతు సమస్యలపై, ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై పార్టీలకతీతంగా నిరంతరం పోరాటం సాగించారు. జయచంద్రచౌదరి మృతి పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ ్యక్తం చేశారు. ఈమేరకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు ఎన్‌పీ.దుర్గ రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి.వెంకటేశ్వర చౌదరి, కాణిపాకం ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, అర్ధగిరి ఆలయ ఛైర్మన్ రఘుపతి, తవణంపల్లె, ఐరాల మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి, హరిబాబునా యుడు, రైతు సంఘం నాయకులు మునిరత్నంనాయుడులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయ కులు,రైతుసంఘాలనాయకులుజయచంద్రచౌదరి పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

## నేడు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకుంటే క్షేత్ర స్థాయిలో ఆ సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి చర్యలు తీసుకుంటారు.

## బ్రిటీషు వారిపై తొలి తిరుగుబాటు వీరుడు ఉయ్యాలవాడ

**చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**



బ్రిటీషు వారిపై తిరుగుబాటు చేసి మొదటి తెలుగు విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఏఆర్ డిఎస్పీ దేవ దాస్ అన్నారు. జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఆదివా రం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 175వ వర్ధంతి పురస్కరిం చుకుని ఆయన చిత్రపటానికి ఏఆర్ ఎస్పీ దేవదాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ గడ్డపై బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా మొదటిసారి ధైర్యంగా తిరుగుబాటు చేసిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాష, అడ్మిన్ ఆర్ఐ ప్రభాకర్, సిబ్బంది ూ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్ ప్రదానం

**పలమనేరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**



పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎస్.నాగర త్నమ్మకు కుప్పం ద్రవిడ యూనివర్శిటీ పిహెచ్‌డి డాక్టరేట్ ప్రధానం చేసింది. తెలుగు విభాగం ఆచార్యులు బూదాటి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రకాశరావు గారి రచనలపై నాగరత్నమ్మ సాహితీ వరివస్య అనే అంశంపై పార్ట్ టైమ్ పరిశోధనలు చేశారు. ఇందుకు సంబంధించి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సోలార్ సిస్టమ్ ఏర్పాటు

ఎంపి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం

**పలమనేరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**



పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ వెంట లేటర్‌ను ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు చలికాలంలో చన్నీటి స్నానాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తన దృష్టికి తేవడంతో ఎంపి నిధులు రూ.3 కోట్లు వ్యయంతో ఈ వెంటలేటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇక నుండి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడినీటితో సాన్నాలు చేయవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి అంచెలంచెలుగా జిల్లా స్థాయి ఆసుపత్రిగా తీర్చి దిద్దుతామన్నారు. అలాగే ఆసుపత్రి పైభాగంలోకి వెళ్ళడానికి లిఫ్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. టిడిపి నాయకులు ఆర్‌వి బాలాజీ, గిరిబాబు, నాగరాజు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్‌విండో ఛైర్మన్‌కు మాతృవియోగం

**చౌడేపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



సింగిల్‌విండో ఛేర్మన్ పగడాల హరిప్రసాద్ రాయల్‌కు మాతృవియోగం జరిగింది. చౌడేపల్లి పరిధిలోని చిట్టెడ్డిపల్లికి చెందిన రెడ్డెమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈక్రమంలో వ్యాధి తీవ్రత అధికం కావడంతో ఆమె మృతి చెందింది. తేదేపా నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మృతురాలు రెడ్డెమ్మకు ఘన నివాళులర్పించి, హరిప్రసాద్ అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు.

## శాస్త్రససోక్తంగా బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

**చౌడేపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంలో బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ట, గణపతి, నవగ్రహపూజ, నేతోమేళన, బింబిశుద్ధి, హోమము పూర్ణాహుతి అనంతరం గంగమ్మకు పంచాయుత అభిషేకంగావించారు. గ్రామస్తుల సమక్షంలో తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పూజాధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## చౌడేపల్లి ఎస్ఐగా చిన్నరెడ్డెప్ప

**చౌడేపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



చౌడేపల్లి మండల ఎస్ఐగా చిన్నరెడ్డెప్ప నియమితులయ్యారు. ఆదివారం ఈమేరకు ఆయన స్థానిక పోలీస్టేషన్‌లో పదవీబాధ్యతలు చేపట్టారు. శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మను దర్శించుకొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న నాగేశ్వరరావు మదనపల్లి-2కు బదిలీ అయ్యారు. చిత్తూరు మహిళా పోలీస్టేషన్‌లో వున్న చిన్నరెడ్డెప్ప చౌడేపల్లికి నియమితులయ్యారు.

## కేతనపల్లిలో అగ్నిప్రమాదం : రూ. 75వేలు ఆస్తినష్టం

**చౌడేపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



అగ్నిప్రమాదం సంభవించి రూ. 75వేల వరకు ఆస్థినష్టం వాటిల్లిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలం లోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లికి చెందిన జె.నాగ రాజుకు కేతనపల్లి అటవీ ప్రాంతానికి సమీపంలో మామిడి, కొబ్బరి తోట వుంది. తోటకు చుట్టూవున్న కంచెకు నిప్పంటు కోగా దాదాపు 50మామిడి, పలు కొబ్బరిచెట్లు కాలిపోయాయి. పుంగనూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి మంటలను పూర్తిగా అదుపు చేసారు. గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి ఆర్ప కుండా బీడీ ముక్కలను వేసినందున అగ్నిప్రమాదం సంభవించిందని పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. రూ. 75వేల వరకు ఆస్థినష్టం సంభవించిందని రైతు నాగరాజ తెలిపాడు.

## మెగా రక్తదాన శిబిరంలో 52మంది రక్తదానం

**కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**




లయన్స్‌క్లబ్, కుప్పం ఆక్సిస్ బ్యాంక్, ఏరియా ఆస్పత్రి అధ్వర్యంలో ఆదివారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంకు విశేష స్పందన లభించింది. 52మంది ఈసందర్భంగా రక్తదానం చేశారు.వారికి సర్టిఫికెట్లు అందించారు. ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ మాట్లాడుతూ రక్తదానం మహాదానం అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నపుడు రక్తదానం చేయాలని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్ మాట్లాడుతూ సమాజసేవే తమ ప్రధాన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో విద్య, వైద్య రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ డా॥ విజయకుమారి, డా॥ శ్యామల, డా॥ హరిప్రియ, డా॥ సుప్రియ, ఆస్పత్రి డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆక్సిస్ బ్యాంక్ మేనేజర్ హరి ప్రసాద్, లయన్స్‌క్లబ్ సభ్యులు పిజి సెల్వం, శివతేవర్, ప్రసాద్, చరణ్, జయరాంనాయుడు, కృష్ణమూర్తి, వరదరాజులు, నాగరాజు, ఓబన్న, సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## విద్యతో పాటు ఆధ్యాత్మిక చింతన అవసరం

**చిట్వేలి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**



విద్యార్థులకు విద్యతోపాటు దైవచింతనతో కూడిన ఆధ్యాత్మికత అవసరమని ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వెంకట శివ, సాయిరాం ఏబీఎన్ ప్రసాద్, రంగారెడ్డి లు అన్నారు. ఆదివారం స్థానిక శివాలయంలో పిల్లలకు ధార్మిక విద్యలో భాగంగా పిల్లలకు బుద్ధి బలాన్ని పెంచే సర్వగాయత్రి మంత్ర జపసాధన, సరస్వతి మమస్తుభ్యం లాంటి శ్లోకాల అబ్యాసనం,శ్రీ రామాయణాధ్యయనం భక్తి గీతాల అబ్యాసం, ఆరోగ్యాన్ని పెంచే యోగాసనాల అబ్యాసం,ఆరోగ్యంతో కూడినట్టి మంచి సంస్కారాలను నేర్పించారు. వందమంది పిల్లలు వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సునీల్, సమరతపౌండేషన్ సభ్యులు సుబ్బారాయుడు ఆచారి, చలమారెడ్డి,శివాలయం అర్చకులు సురేంద్రశర్మ, పవన్ శర్మ, పిల్లలు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## హద్దు దాటితే కఠిన చర్యలు తప్పవు

**చిట్వేలి,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:**



నిర్ణయించిన హద్దు దాటి రోడ్డుపైన వ్యాపారాలు చేపట్టి; ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం తమ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారిలో కాలినడకన గస్తీ నిర్వహించారు. ముందుకు వచ్చి వ్యాపారం నిర్వహిస్తున్న వారికి ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. వ్యాపారస్తులు సీసీ కెమెరాలను కలిగి ఉండాలన్నారు. పెద్ద శబ్దాలు చేస్తూ వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఆటోలు, జీపులు, టాటా మ్యాజిక్ వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలపరాదని స్టాండ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రయాణికుల కోసం ఒక్క వాహనాన్ని మాత్రమే రహదారిపై నిలుపుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై వినోద్ కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంలో నుంచి పడి మహిళ మృతి

**పెనగలూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం కొండూరు క్రాస్ రోడ్డు స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహన ప్రమాదంలో మామిళ్ళ సుజాత (55) మృతి చెందినట్లు ఏఎస్సై నాగేశ్వరమ్మ తెలిపారు. పోలీసు వారు తెలిపిన వివరాలు మేరకు.. కోడూరు మండలం గంగరాజు పురం గ్రామానికి చెందిన సుజాత తన కొడుకు సాయి కుమార్ తో కలిసి ద్విచక్ర వాహనం లో నల్లపురెడ్డిపల్లి లో ఉన్న తన బందువులు ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యంలో ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. కొండూరు క్రాస్ రోడ్డు స్పీడ్ బ్రేకర్ వద్ద ఆమె ఎగిరి కింద పడి గాయలైనట్లు పేర్కొన్నారు. వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించినట్లు చెప్పారు. అక్కడ శనివారం సాయంత్రం 8 గంటల సమయం లో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి మొదటి కుమారుడు సురేంద్ర ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తునట్లు చెప్పారు.

## యువతి ఆత్మహత్య

**రైల్వేకోడూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకుల పేటకు చెందిన ఆమంచి భార్గవి ( 24) ఆదివారం ఇంటిలోని ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు బిఈడి చదువుతుందని, ఏ విధంగా మృతి చెందిందో అర్థం కాని స్థితిలో ఉన్నామని ఆమె తల్లి తెలిపారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

## ఎ.పి.ఎడ్‌సెట్ -2026కు దరఖాస్తుల ఆహ్వానం

- కన్వీనర్ శ్రీనివాస్‌కుమార్

**కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్వర్యంలో నిర్వహించనున్న ఎపి ఎడ్‌సెట్ -2026కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్, ద్రవిడ వర్సిటీ విద్యాశాఖ ప్రొఫెసర్ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. బి.ఎడ్ మరియు బి.ఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కొరకు అభ్యర్థులు మార్చి 9వతేది లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అపరాధరుసు ంతో మార్చి 25వతేది వరకు దరఖా స్తు చేసుకోవచ్చున్నారు. మే 4వతేది ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు హెచ్‌టిటిపిఎస్://సెట్స్. ఎపిఎస్‌సిహెచ్ఇ.ఒఆర్‌జి.ఎపి.జిఒవి.ఇన్/ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్

**కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకు కెఎస్ఎస్ సభ్యులు కృషి చేయాలని కుప్పం మండల ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్, కొటాలూరు సర్పంచ్ రాజే ంద్రన్, యూనిట్ ఇన్‌చార్జ్ సంజీవరాజులు కోరారు. ఆదివారం పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్ మాట్లాడుతూ ప్రతి కెఎస్ఎస్ సభ్యుడు తమకు కేటాయించిన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. అలాగే వారికి కలుగుతున్న లబ్ది వివరాలు సేకరించాలన్నారు. ప్రజల సలహాలు, సూచనలు సైతం తప్పక తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు పొన్ను, పంచాయతీ ఐటిడిపి అధ్యక్షుడు రాజువిల్, బూత్ ఇన్‌చార్జ్ శంకర్, నేతలు రామూర్తి, ముత్తుకుమార్, వరదరాజులు పాల్గొన్నారు.

## డికెపల్లిలో తెదేపా డోర్‌టుడోర్ కార్యక్రమం

**కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



స్థానిక 11 వ క్లస్టర్‌పరిధి డికెపల్లిలో తెదేపా కెఎస్ఎస్ అధ్వర్యంలో డోర్‌టుడోర్ కార్యక్రమం చేపట్టారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలు నేరుగా తెలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఏయే ప్రభుత్వ పథకాల్లో వారికి లబ్ది కలుగుతోందో వివరాలు సేకరించారు.నేతలు వేలు, నబీఉల్లా, సుభాన్‌బాబు, భాస్కర్, సోమశేఖర్, సాయికుమార్, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చాగంటి ప్రవచనాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధూర్జటి కళావేదికపై సాయంత్రం 6గంటలకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇఒ డి.బాపిరెడ్డివివరించారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ఇక్కడి గిరి ప్రదక్షిణ ప్రాధన్యాతను చాగంటి కోటేశ్వరరావు ప్రచారం చేయటమే కాకుండా ఆయనే గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

## సాయిమందిరం మహాకుంభాభిషేకం

తొట్టంబేడు,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణ పొలిమేరల్లోని చెన్నైరోడ్డులో వెలసిన షిరిడి సాయిబాబు ఆలయ మహాకుంభాభిషేకం మూడు రోజుల పాటు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆదివారం బాబా విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు.అలాగే మూడు రోజుల పాటు పవిత్రంగా నిర్వహించిన కలశాలను ఉద్వాసన జరిపి ఆ నీటితో శిఖర గోపురంపై ప్రతిష్టించిన కలశాలకు అభిషేకించారు.ఈ ధార్మిక కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులు సాయి బాబా భక్తులు పాల్గొన్నారు. ఆయనకు షిరిడా సాయి సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమాల్లో రామూగుప్తా, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వన్నెకుల క్షత్రియ ఐక్యతను సాధిద్దాం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



సమాజంలో అత్యధిక శాతం ఉన్న వన్నెకుల క్షత్రియుల సమస్యల సాధనకు ఐక్యతగా పని చేద్దామని ఆదివారం జరిగిన సమావేశంలో నాయకులు పిలుపు నిచ్చారు.ఈ సందర్బంగా శ్రీకాళహస్తిలో వన్నెకుల క్షత్రియుల సంఘం సారధ్యంలో మార్చి 8న తిరుపతిలో జరగబోవు ఆత్మీయ సమ్మేళనం, వివాహ పరిచయ వేదిక వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసమావేశంలో కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బాలసుబ్రమణ్యం,అయ్యంగార్,మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియులు ఐక్యంగా ఉన్నారన్నారు. మంచి అవగాహనతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. వన్నెకులు క్షత్రియులు వేయ్యి సంవత్సరాల చరిత్ర కల్గిన వారన్నారు. అంకిత భావంతో తిరుపతిలో జరుగు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘ నాయకులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పేట బాలాజి రెడ్డి, ఎంఎస్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామారావు, కరుణాకర్‌రెడ్డి, రుద్ర, కిషోర్, రాము,మధు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

తిరుపతి విద్య ఫిబ్రవరి 22 ప్రభాత వార్త

ఎస్వీయూ జాగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెల 25వ తేది వరకు మూడు రోజుల పాటు జలం, నేల మాజమాన్యంలో భౌగోళిక అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన అంశాలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జాగ్రఫీ విభాగాధిపతి ఎన్ చంద్రాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి 180 మంది ప్రతినిధులు ఈ సదస్సు హాజరవుతారని తెలియజేశారు.

## ఎమరాల్డ్స్ ఘనంగా ఈక్వెస్ట్ 2026

తిరుపతి విద్య ఫిబ్రవరి 22 ప్రభాత వార్త




స్థానిక ఎల్ ఐ సి రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఈక్వెస్ట్ పెస్ట్ 2026 ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ సంసవత్సరం బీబీఏ విద్యార్థులకు వినూత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టాక్ గేమ్, బిజినెస్ క్విజ్, స్పార్క్, బిజినెస్ ప్రపోజల్, యాడ్డే గేమ్ విభాగాలలో పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళావాల సంచాలకులు గిరిదర్, విశ్వనాద్ విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలలో తరచుగా పాల్గొంటూ ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుచుట కొరకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ఉపసంచాలకులు ఎం మునిరత్నం ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులను, బహుమతులను అందజేశారు.

## ముగిసిన స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ .

తిరుపతి విద్య ఫిబ్రవరి 22 ప్రభాత వార్త



జాతీయ సంస్కృత వర్సిటీలో గత వారం రోజులుగా జరిగిన స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ ఆదివారం ముగిసింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీన్ ప్రొఫెసర్ వెంకటరావు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ విద్యార్థులకు ప్రధానమని, భవిష్యత్తులో భావిభారత పౌరులను తయారు చేయడానికి, క్రమశిక్షణకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్డీ ప్రొఫెసర్ రాధా గోవింద త్రిపాఠి, డీన్ ప్రొఫెసర్ దక్షణమూర్తి శర్మ, డాక్టర్ ఎం దత్తాత్రేయ శర్మ, స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 26వ తేదీ నుంచి జనసేన సభ్యత్వ నమోదు

డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్.

తిరుపతి విద్య ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. రెండు వారాలు పాటు జరిగే సభ్యత్వ నమోదు లో అందురూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్ లో జనసేన సభ్యత్వ నమోదుపై యాభై డివిజన్ల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్బంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ మార్చి 10వ తేదీతో ముగుస్తుందన్నారు. గత ఏడాది తిరుపతి నియోజకవర్గం 16,063 మంది సభ్యత్వంతో రాయలసీమలో మొదటి స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు సమన్వయకర్తగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును పార్టీ నియమించిందని ఆయన తెలిపారు. కావున తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని క్రియాశీలక సభ్యత్వ నమోదులో రాయలసీమలోనే మొదటి స్థానంలో నిలపాలని ఆయన నాయకులను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు జనసైనికులు ఎదుర్కొని సభ్యత్వ నమోదు చేశారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆయన చెప్పారు. సాధకులు పార్టీ సానుభూతిపరులను, పవన్ కళ్యాణ్ అభిమానులను సభ్యత్వ తీసుకునేలా చూడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి,కార్పొరేటర్ దూది కుమారి, తిరుత్తణి వేణుగోపాల్ , దూది శివ, జేకే రాయల్, ముక్కు సత్యవంతుడు, బాబ్జీ, ఆకుల వనజ, కీర్తన, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులు మురళీ, బాలిశెట్టి కిషోర్,సుధాకర్, రాజేష్ ఆచ్చారి, పోటుకూరు ఆనంద్, కూరపాటి సురేష్, నీలాద్రి, మైలు రాము, ఆర్కాట్ కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కస్తూర్బా గాంధీకి ఘన నివాళి

తిరుపతి విద్య, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



స్థానిక గాంధీ రోడ్ లోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం కస్తూర్బా గాంధీ వర్ధంతి సందర్భంగా కస్తూర్బా గాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి సి రాయులు కస్తూర్బా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి అత్యంత మౌనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి సి రాయులు మాట్లాడుతూ, కస్తూర్బా గాంధీ మహాత్మా గాంధీ సతిమణి. అని, భారత స్వాతంత్ర సమర యోధురాలని, ప్రజలు ఆమెను ప్రేమగా బా అని పిలుచుకుంటారని, దక్షి ణాఫ్రికాలో గాంధీజీ తో కలిసి వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లోను, భారతదేశంలో క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లోనూ క్రియాశీలక పాత్ర పోషించారని, మహిళా సాధికారత, విద్య, శుభ్రత పట్ల ఆమె ఎంతో కృషి చేశారని, ఆమె పుట్టినరోజు అయిన ఏప్రిల్ 11 భారతదేశంలో జాతీయ సురక్షి త మాతృత్వ దినోత్సవంగా జరుపుకుంటారని, తెలియజేస్తూ వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది

## అందరికీ శుభాలు కలగాలి



తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని మాజీ ఎంపి,మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం ఆయన సాంప్రదాయ దుస్తుల్లో శ్రీవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## బ్రాహ్మణుల ఐక్యత చాటుకునేలా

దక్షి ణ భారత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి,ఫిబ్రవరి 22ప్రభాతవార్త:




బ్రాహ్మణుల ఐక్యత చాటుకునే విధంగా అన్ని సంఘాలను ఏకతాటిపై తీసుకురావాలనే సరుద్దేశంతో ముందడుగు వేసి తిరుపతి జిల్లాలోని బ్రాహ్మణ సంఘాలతో వేదికను ఏర్పాటుచేయడం జరిగిందని వక్తలుతెలిపారు. స్థానిక కరకంబాడి రోడ్డు లోని ఉద్దండ గణపతి వేద పాఠశాలలో దక్షి ణ భారతీయ బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక , షష్టిపూర్తి మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగింది. తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ నరసింహాచార్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ లు షష్టిపూర్తి మహోత్సవాలు శాస్త్రోక్తంగా సామూహికంగా నిర్వహించారు. నూతన వధూవరుల వివాహ పరిచయవేదికలో దాదాపు 800 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేదిక్ యూనివర్సిటీ ఉపకులపతి రాణి సదాశివమూర్తి , సంస్కృత యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌జి ఎస్ ఆర్ కృష్ణమూర్తి ,గుడిపాల తాసిల్దార్ సీతారాం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్ ,కొత్తపల్లి అజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు ముకుందాపురం మహేష్, సింగరాజు నాగార్జున, డాక్టర్ చక్రపాణి, పాటి బంద మురళి శర్మ, రెడ్డిప్రకాష్, కృష్ణమూర్తి, బాలాజీ శర్మ, బాలాజీ రావు, మణికంఠ, శివకుమార్, తిరుపతి బ్రాహ్మణ సమాజం ఉపాధ్యక్షుడు వెంకట పెరుమాళ్, బీమాస్ అశోక్, కొత్తపల్లి విజయ్ కుమార్, సురేష్ కుమార్, తులసి రామ్ శర్మ, హరిణి, మహిళా జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి తల్లిదండ్రులు, నూతన వధూవరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో త్వరితగతిన

బలిజ భవన్ నిర్మాణం పూర్తి చేయాలి



తిరుపతి,ఫిబ్రవరి 22ప్రభాతవార్త:

తిరుపతిలో త్వరితగతిన బలిజ భవన్ నిర్మాణం పూర్తి చేయాచేయాలని లక్ష్యంగా పెట్టుకుని బలిజ భవన్ అభివృద్ధి సొసైటీ నిర్ణయించింది. ఆదివారం ఈ కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ జోన్4 కోఆర్డినేటర్ దీపక్ రెడ్డి , రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం , ఇన్‌చార్జ్ సుగుణమ్మ , పార్టీ నాయకులు బుల్లెట్ రమణ,, ప్రణీత్,అధ్యక్షుడు వసంతం శ్రీనివాసులు ,కార్యదర్శి చిన్నా రాయల్ ,అంతరాజి చంద్రశేఖర్ , సింగం సుబ్బరామయ్య, దేపూరి భాస్కర్,బోయల్ల విజయ్ కుమార్,సిరిగిరి.దిలీప్ జయకృష్ణ, జల్లిసెట్టి విజయ్ కుమార్, కోట చక్రపాణి, బండ్ల లక్ష్మీ ప్రతి , తుపాకుల మురళి. మహిళలు వైష్ణవి సుజాత సూర్య కుమారి పోలి సునీత పాల్గొన్నారు. డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2014లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం తిరుపతిలో బలిజ భవన్ నిర్మాణం కోసం భూమిని మంజూరు చేసింది. ఆ సమయంలో రెండు కోట్లు నిధులు కూడా మంజూరు చేయబడ్డాయి. అయితే ఆ నిధులు విడుదల కాలేకపోయాయి. అనంతరం ఏర్పడిన ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం బలిజ సమాజానికి నిరాశ కలిగించింది.

## పచ్చని చెట్లను జెసిబితో నిర్ధాక్షిణ్యంగా తొలగించారు

జక్కలవారిపల్లి భావన హేమాద్రి దంపతులు ఆవేదన




చంద్రగిరి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

పచ్చని చెట్లను అర్ధరాత్రి వేళ జెసిబితో నిర్ధాక్షిణ్యంగా తొలగించారని పనపాకం పంచాయతీ, జక్కలవారిపల్లికి చెందిన భావన హేమాద్రి దంపతులు కన్నీటిపర్యంతమయ్యారు. గత కొద్ది రోజులుగా భావన హేమాద్రి దంపతులకు సంబంధించిన భూమి తగాదా జరుగుతున్నది. తమ తాత ముత్తాల కాలం నుండి వంశపారపర్యంగా వస్తున్న సర్వేనంబర్ 625/1డి1లో 4 సెంట్లు భూమి వుందన్నారు. ఆస్తిని గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు అర్ధరాత్రి వేళలో జెసిబితో మామిడి, టేకు, అరటి చెట్లను నిర్ధాక్షిణ్యంగా తొలగించి, ఫెన్సింగ్ వేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

## సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎంపిపి అసహనం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



మండల సర్వసభ్య సమావేశానికి కొందరు మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్బంగా నడవలూరులో జరిగిన అభివృద్ధి పనులకు పంచాయతీ కార్యదర్శి సుమలత బిల్లులు చెల్లించడం లేదని సర్పంచ్ గణపతి రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని వ్యవసాయ అధికారి మమతకు ఎంపిపి సూచించారు. మండలంలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై తహశీలా ్ధర్ మధుసూదన్ రావు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పిలి వంక సమీపంలోని పెద్దనాల బండపై వాటర్ షెడ్ పథకంలో నిర్మించిన కళ్ళాన్ని ధ్వంసం చేసిన అనుపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపిడిఓను కోరారు. గంగిరెడ్డిపల్లి సమీపంలో తహశీల్దార్ భూమిని కేటాయిస్తే రూ.3.25 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం సిద్దంగా వుందని ఎలక్ట్రికల్ ఏఈ గిరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, జడ్పీటిసి ఢిల్లీరాణి, ఎంపిటిసిలు మంజుల సిద్దారెడ్డి, జ్ఞానమ్మ, కృష్ణవేణి, మునీంద్రబాబు, సర్పంచ్‌లు మురగయ్య, హిమాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మునిశేఖర్ కుటుంబానికి బొజ్జల బృందమ్మ పరామర్శ

వడమాలపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



వడమాలపేట మండలం వడ్డిపల్లిలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ, అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సానంబట్ల మునిశేఖర్ కుటుంబాన్ని శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ఆదివారం పరామర్శించారు. వడమాలలోని మునిశేఖర్ స్వగృహంలో నిర్వహించిన కర్మక్రియల సందర్బంగా ఆమె అక్కడికి చేరుకుని, మునిశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మునిశేఖర్ సతీమణి సంధ్యాలక్ష్మిని, వారి కుమారాష్తెలను ఓదార్చి, ఆ కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఒక మంచి ఉపాధ్యాయుడిని కోల్పోవడం గ్రామానికి, విద్యాశాఖకు తీరని లోటని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## బలిజ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని అయ్యలనాడు చెరువులో కేటాయించిన బలిజసంఘ భవనానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఎంతో కాలంగా ఇక్కడ బలిజ సంఘ భవనం నిర్మాణానికి ప్రయత్నాలు జరిపారు.కానీ సఫలీకృతులు కాలేదు. ప్రస్తుతం బలిజసంఘ యువకులు ఎలాగైనా భవన నిర్మాణాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్మించాలని నిర్ణయించారు.ఈ మేరకు ఆదివారం భూమి పూజను నిర్వహించారు.ఈ సందర్బంగా నాయకులు భవనాన్ని ఐదు నెలల్లో పూర్తి చేసి ప్రారంభించాలని నిర్ణయించారు. ఎవరి వంతు వారు. సహాయ సహకారాలు అందించాలని పిలుపు నిచ్చారు.శ్రీకాళహస్తిలో ఎన్నో దశాబ్దాలుగా బలిజ కులస్థులకు సంఘ భవన నిర్మాణం ప్రకటనల్లోనే పరిమితంగా ఉండేదని నేడు కల నెరవేరిందని వివరించారు. నియోజకవర్గంలో అత్యధిక శాతం బలిజ సామాజిక వర్గానికి చెందిన వారున్నా వారి కార్యక్రమాలు నిర్వహణకు సంఘ భవనం లేదనే వాదనకుపుల్ స్టాప్ పెట్టాలని నిర్ణయించారు.భూమి పూజల కార్యక్రమాల్లో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు శెట్టిపల్లి సురేష్, మాజీ మున్సిపల్ చైర్మెన్ ముత్యాల పార్ధసారధి,గాజుల సత్యనారాయణ, దండిరాఘవయ్య, గరికపాటి చంద్ర,వెంకటేష్,దుమ్మురాయల్, నరేంద్ర, కండ్రిగ ఉమ,కంఠా రమేష్, కాసరం రమేష్, పగడాల రాజు, మొగరాల గణేష్ వజ్రం కిషోర్, షణ్ముగం, ప్రభాకర్, పగడాల ప్రతాప్, చిలకా గోపి, హరీష్‌రాయ్, వేణుగోపాల్, తుకారం నాని, కంఠా ఉదయ్ కుమార్, జాజాల ముని,మున్నారాయల్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీ వేదనారాయణ స్వామి సేవలో ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



నాగలాపురం పట్టణంలో వెలసిన శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామిని ఎమ్మెల్యే ఆదిమూలం ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీ వేదనారాయణ స్వామి ఆలయ మహా కుంభాభిషేకం పూజలు అత్యంత వైభవంగా జరిగింది. కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు కుంభాభిషేక మంత్ర జలంతో ఆశీర్వదించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళి, ఎస్ఎం సురేష్, రాజమాణిక్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, బాబా పళణి, కూటమి ప్రభుత్వనాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## దుర్గసముద్రం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:



దుర్గసముద్రం ఉన్నత పాఠశాలలో 2009-2010 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చాలా కాలం తర్వాత కలుసుకున్న సహచరులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులుగా సేవలందించిన వెంకటనారాయణ చౌదరి, ధనంజయులు, మునిరాజులు, పుష్పవాణి, చెంగ్రాయులు హాజరై విద్యార్థులతో కలిసి ఆనందంగా గడిపారు. అప్పటి తరగతి గది వాతావరణం, పాఠశాల కార్యక్రమాలు, పరీక్షల సన్నాహాలు వంటి అనేక అనుభవాలను గుర్తు చేసుకొంటూ భావోద్వేగాలకు లోనయ్యారు.ఈ సందర్బంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవరుచుకోవాలని, కుటుంబాలకు, సమాజానికి ఉపయోగపడే బాధ్యాతయుత పౌరులుగా ఎదగాలని హితవు పలికారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నప్పటికీ గురువులను పాఠశాలను మరవకూడదని సూచించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం అందరిలోను కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేవి క్రీడలే

-జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:



యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేది క్రీడలేనని జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచుతాయన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో (మై భారత్-చిత్తూరు) నిర్వహణలో జిల్లా స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు తిరుపతిలోని యూత్ హాస్టల్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా సెట్విన్ సిఇఓ డాక్టర్ యశ్వంత్ హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనాలని, చదువుతో పాటు ఆటలు, పాటలు, సంభాషణ నైపుణ్యా లను పెంపొందించుకోవడం ద్వారా సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ క్రీడా పోటీలలో మొత్తం 16 జట్లు పాల్గొనడం విశేషం. పోటీలు ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకులను అలరించాయి. ఈపోటీలలో మొదటి బహుమతిని శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ జట్టు రూ.6000 నగదు, రెండో బహుమతిని బాలాజీ వాలీబాల్ జట్టు రూ.4000 నగదును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాస్ అధ్యక్షుడు కె.జ్ఞానశేఖర్‌రెడ్డి యువత మై భారత్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, కేంద్ర ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయక్, అరుణ, జూలియన్‌రాజు, స్టేడియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో టిడిపి పార్లమెంటరీ భవన నిర్మాణానికి ఘనంగా భూమిపూజ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీలో ఆదివారం తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శుభారంభం చేశారు. గాంధీపురం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495/11లో 15 సెంట్లు, 495/5లో 1.85 సెంట్ల స్థలంలో ఆధునిక సౌకర్యాలతో టిడిపి పార్లమెంటరీ కార్యాలయ భవనం నిర్మించనున్నారు.పార్టీ కార్యకలాపాలకు కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఈ భవనాన్ని తీర్చిదిద్దనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తుడా చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సత్యవేడు టిడిపి ఇన్‌చార్జి కూరపాటి శంకర్‌రెడ్డి, తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, పులివర్తి వినీల్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవలందించడానికి

అపోలో ఫార్మసీలో మౌలిక సదుపాయాలు

తిరుపతిహెల్త్,ఫిబ్రవరి 22ప్రభాతవార్త:

నాణ్యమైన మందులు,వెల్‌నెస్ ఉత్పత్తులు అందుబాటులో ఉండడం ప్రజారోగ్య రంగంలో చాలా కీలకమని, ప్రజలకు సమర్థంగా ఈ తరహా వైద్య సేవలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న అపోలో ఫార్మసీ సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు 50 వేలకు పైగా నాణ్యమైన మందులు, ఇతర వెల్‌నెస్ ఉత్పత్తులను ఈ ఫార్మసీ అందిస్తోంది. వీటిలో చాలావరకు స్టోర్లు రోజుకు 24 గంటలూ సేవలు అందిస్తున్నాయని,అన్ని జిల్లాలకూ మందులు చాలా వేగవంతంగా సరఫరా చేస్తూ అత్యవసరమైన వైద్య సేవలను కూడా ప్రతిరోజూ విస్తరించడం మంచిపరిణామమన్నారు. రాష్ట్రంలో వెయ్యి స్టోర్లతో బలోపేతమైన అపోలో ఫార్మసీ 15 జిల్లాల్లో విస్తరించిందన్నారు. అపోలో 24/7 ద్వారా ప్రజలకు కేవలం మందులు అందించడం మాత్రమే కాకుండా,అపోలో వైద్యులతో టెలికన్సల్టేషన్లు, డయాగ్నస్టిక్ సేవలు, కస్టమైజ్డ్ బీమా సదుపాయాలు కూడా వారి ఇంటి వద్దనే అపోలో అందిస్తోందన్నారు.

## శ్రీవారి పాదాల చెంత

టిడిపి కార్యాలయం మంచిరోజులకు నిదర్శనం,-భూమిపూజలో నేతలు

తిరుపతి,ఫిబ్రవరి 22ప్రభాతవార్త:



తిరుపతిలో శ్రీవారి పాదాలచెంత టిడిపి పార్లమెంటు కార్యాలయం భవనం నిర్మాణం చేసుకోవడం ఆనందకరమని,ప్రతి టిడిపి కార్యకర్తకు ఒక సొంత ఇల్లు లాంటిదని టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ భూమి పూజలో పాల్గొనడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఆదివారం ఉదయం అవిలాల సమీపంలోని శ్రీజ డెయిరీ ప్రాంతంలో నూతనంగా నిర్మించనున్న టిడిపి పార్టీ కార్యాలయానికి భూమిపూజ జరిగింది. తిరుపతి వాసులకు సొంత పార్టీ కార్యాలయం నిర్మాణం కలను నిజం చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మరో 25 సంవత్సరాలు టిడిపి అధికారంలో ఉండేవిధంగా దేవుడ్నివేడుకుంటున్నామన్నారు. ఆధునిక టెక్నాలజీతో మరో ఆరు నెలల్లో ఈ భవనం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలు పనబాకలక్ష్మి, ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, రాష్ట్ర పచ్చదనం సుంద రీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ సంక్షేమకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, ఎమ్మెల్యేలు బొజ్జలసుదీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, పార్టీ నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, దంపూరి భాస్కర్, రవినాయుడు, శ్రీధర్‌వర్మ, మన్నెం శ్రీనివాసులు, జెబి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ మన్ కీ బాత్ స్ఫూర్తిదాయకం

తిరుపతి,ఫిబ్రవరి 22ప్రభాతవార్త:



ప్రపంచదేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెలా నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుం దని బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి తెలిపారు. ప్రజలం దరూ ఈ కార్యక్రమాన్ని వీక్షి ంచి,ఆర్థికం గా అబి.వృద్ధి చెందాలన్నారు. ఆదివారం ఉదయం జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వీక్షి ంచారు. మన్ కి బాత్ లో ప్రధానమంత్రి కొత్త విషయాలను తెలియజేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కే ఎన్ రాజా, చంగ్రాయ ఆచారి, వెంకటరత్నం,చెంగల్ రాయులు, విగ్రహాల కళ్యాణి, సిద్దమ్మ,

# సూళ్ళూరుపేట డివిజన్

## దొరవారిసత్రం ఎస్ఐగా వెంకటేశ్వరచౌదరి



దొరవారిసత్రం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండలం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా గరికపాటి వెంకటేశ్వర చౌదరి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలోని శాంతి భద్రతలు పరిరక్షణకు కట్టుబడి పని చేస్తామని తెలిపారు. మండలంలోని అసాంఘిక కార్యకలాపాలు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సూళ్లూరుపేట ఎస్ఐగా అజయ్‌కుమార్



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నూతన ఎస్ఐగా అజయ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. దొరవారిసత్రం ఎస్ఐగా పనిచేస్తున్న అజయ్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. సూళ్లూరుపేట ఎస్ఐగా పనిచేస్తున్న బ్రహ్మనాయుడు ఇక్కడి నుంచి బదిలీ అయి నాయుడుపేట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్ నియంత్రణ, ఈవ్ టీజింగ్, గంజాయి అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

## కనుమరుగవుతున్న మ్యాజిక్ కళ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ప్రస్తుత సమాజంలో అనేక కళలు క్రమేపి కనుమరుగు అవుతున్నాయి. అందుకు నిదర్శనంగా ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన మ్యాజిక్ కళ క్రమేపి తన ఉనికిని కోల్పోతోంది. ఎందరో కళాకారులకు ఉపాధి కల్పించిన ఈ కళ ప్రస్తుతం నెలకొన్న సాంకేతిక పరిణామాలతో కాస్త వెనుక బడింది. ఈ నేపథ్యంలో మ్యాజిక్‌పై మక్కువతో ప్రముఖ మ్యాజిక్ కళాకారులు, దివంగత బివి పట్టాభిరామ్ ఏకలవ్య శిష్యుడిగా పేరొందిన సూళ్లూరుపేటకు చెందిన ఎంఎస్‌రెడ్డి ఇప్పటికీ తన మ్యాజిక్ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నాడు. మద్రాస్ అకాడమితో పాటు ఎన్నో పురస్కారాలు ఎంఎస్ రెడ్డి అందుకుని ఉన్నారు. ప్రముఖ సినీ నటులు అక్కినేని నాగేశ్వరరావు, చిరంజీవి, పవన్ కల్యాణ్, రాజేంద్రప్రసాద్ వంటి వారి మన్ననలు పొంది ఉన్నారు. ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ కేవలం సంపాదనే ధ్యేయంగా మ్యాజిక్ కళను తాను నేర్చుకోలేదని, ప్రజలను చైతన్యపరచడం ద్వారా ప్రస్తుత సమాజంలో మ్యాజిక్ కళ ఉనికిని కాపాడటమే తన తాపత్రయమని తెలిపారు.

## సూళ్లూరుపేటలో హ్యాపీ సండే



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలను ఆహ్లాద పరిచి వారిని మానసికంగా ఉల్లాసపరిచి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా హ్యాపీ సండే కార్యక్రమానికి సూళ్లూరుపేట మున్సిపల్ అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక జూనియర్ కాలేజి మైదానంలో ఉదయం వాకింగ్, జిమ్ చేస్తున్న క్రీడాకారులు, ఇతర ఉత్సాహవంతులైన ప్రజలతో ఈ కార్యక్రమాన్ని ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. ఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండండి : కమిషనర్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మున్సిపల్ అధికార యంత్రాంగం నుంచి ఫోన్ చేసినట్లు ఫేక్ కాల్స్ వస్తున్నాయని, దీని పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య ఆదివారం సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో మాత్రమే పన్నులు చెల్లించాలని తెలిపారు. మున్సిపాలిటీకి సంబంధించి గూగుల్ పే, ఫోన్ పే అకౌంట్లు ఉండవని, ఇది గమనించాలని ఆయన కోరారు.

## విద్యానికి ఆర్థిక సాయం

**- తంబిరెడ్డి చేతుల మీదుగా ఐదు వేలు నగదు చేయూత**



చిట్టమూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: బయ్యావారి కండ్రిగ గ్రామానికి చెందిన బెజవాడ అశోక్ ఆర్థిక సహాయంతో టిఎంఆర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న వెంకటలక్ష్మి అనే విద్యార్థినీకి ఆర్థిక అవసరాల కోసం కరస్పాండెంట్ డాక్టర్ మనోహర్‌రెడ్డి మరియు ప్రిన్సిపాల్ రహంతుల్లా ద్వారా ఐదు వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. చిట్టమూరు మండలంలోని కూడలి ప్రాంతమైన కొత్తగుంటలో టిఎంఆర్ విద్యాసంస్థల పేరుతో ఎంతోమంది పేద, అనాథ విద్యార్థులకు చేయూతనిస్తున్న తంబిరెడ్డి దంపతులు మరి కొంతమంది విద్యార్థినీ, విద్యార్థులకు చేయోతునిచ్చేందుకు దాతల సాయం కోరుతూ ఉండడంతో వారు కూడా సహకరిస్తున్నారు. క్రమంలో ఆదివారం బయ్యావారి కండ్రిగ గ్రామానికి చెందిన అశోక్ అనే దాత ద్వారా ఈ నగదును పేద విద్యార్థిని వెంకటలక్ష్మికి అందించారు.

## నిస్వార్థ సేవకు డాక్టరేట్ పురస్కారం

**- విద్య సేవారంగంలో ఎనలేని కృషి - అమెరికన్ యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్ ప్రదానం- కొత్తగుంటలో విద్యాప్రదాతకు ఘనసన్మానం**





చిట్టమూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: అక్రమార్జన ధ్యేయంగా విద్య, వైద్య రంగాలను ఎంచుకున్న కొంతమంది కార్పొరేట్ శక్తులు ప్రజలను నిలువు దోపిడీ చేస్తూ కోట్లు వెనకేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో వృత్తి దైవం, సేవే దైవంగా భావించిన ఓ అరుదైన వ్యక్తికి అమెరికన్ యూనివర్సిటీ చే డాక్టరేట్ పురస్కారం లభించింది. తీర ప్రాంత మండలమైన చిట్టమూరు ప్రాంతంలో పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు టీఎం రెడ్డి విద్యాసంస్థలను ప్రారంభించిన తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, విజయలక్ష్మి గత 20 సంవత్సరాలు కాలంగా చిట్టమూరు మండలంలోని అనేక గ్రామాల్లో పేద విద్యార్థులను ఉన్నత స్థానంలోనిలిపి వారి భవితకు బంగారు బాటలు వేశారు. గత 20 సంవత్సరాలుగా టిఎంఆర్ విద్యాసంస్థల పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దోహదపడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటూ ప్రజా మన్ననలు పొందుతున్న తమ్మిరెడ్డి మనోహర్ రెడ్డికి అమెరికన్ యూనివర్సిటీచే డాక్టరేట్ ప్రదానం చేయబడింది. విద్యారంగంలో ఎంతోమంది కార్పొరేట్ శక్తులు విద్యార్థులను అన్ని రకాలుగా దోచుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్న తరుణంలో తీర ప్రాంత గ్రామాల్లో సైతం పేద విద్యార్థులకు మెరుగైన విద్య సేవలు అందించాలన్న దృఢ సంకల్పంతో తన గవర్నమెంట్ ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి చిట్టమూరు మండలంలోని కొత్తగుంట గ్రామంలో టిఎమ్ఆర్ విద్యాసంస్థలను ప్రారంభించిన తమ్మిరెడ్డి మనోహర్ రెడ్డి, శ్రీమతి విజయలక్ష్మిలు అనతి కాలంలోనే మెరుగైన ఫలితాలను సాధిస్తూ ముఖ్యంగా పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో విద్యను అందిస్తున్నారు. విద్యా, సేవా రంగాలలో విశేషంగా రాణిస్తూ నిస్వార్థంగా పనిచేస్తున్న టిఎంఆర్ విద్యా సంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి సేవలను గుర్తించిన అమెరికన్ యూనివర్సిటీ ఆయనకు ఇటీవల చెన్నైలో డాక్టరేట్ ప్రదానం చేయడంతో పలువురు ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు ఆయనకు శుభాభినందనలు తెలియజేస్తూ ఆయన అడుగుజాడల్లో తాము సైతం నడిచేందుకు ముందుకు వస్తున్నారు. ఈ సందర్భంగా చిట్టమూరు మండలం కొత్తగుంటలోని తంబిరెడ్డి మనోహర్ రెడ్డి విద్యాసంస్థల అధినేత మనోహర్‌రెడ్డికి డాక్టరేట్ పొందిన నేపథ్యంలో ఆయనను పాఠశాల అధ్యాపక బృందం,సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విజయలక్ష్మి ప్రిన్సిపల్ రహమతుల్లా మేనేజర్ ఆశ శ్రీనివాసులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మహా కుంభాభిషేక వేడుకలు

**కన్నుల పండుగగా కలశం స్థాపన**



సత్యవేడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో కొనసాగుతున్న మహా కుంభాభిషేక వేడుకలు ఆదివారంతో ముగిసింది.

కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు గోపుర కలశ స్థాపన కన్నుల పండగగా నిర్వహించారు. ప్రత్యేక పూజారులు షణ్ముఖ ఆచారి ఆధ్వర్యంలో గోవర్ధన్, సుబ్బయ్య ఆచారి, గంగాధరం, మురగయ్య బృందం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల లోపు కుంభ లగ్న సముమూర్తం శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ప్రధాన విగ్రహంతో పాటు ఉప విగ్రహాలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ట చేశారు. వందలాది మంది భక్తులు శ్రీ అంకాళమ్మ నామస్మరణాలు మారుమోగుతుండగా ప్రత్యేక పూజలు విగ్రహ ప్రాణ ప్రతిష్టగోపుర కలశాలను స్థాపించి మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం కర్పూర హారతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో దర్భధారంలో రువు ఎక్కించుట, నేత్రములు తెరుచుట వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించి మహా నైవేద్యం, మహాబలి, దేవాలయ అష్ట బంధనం తదితర క్రతవులను చేయడం జరిగింది. భక్తులందరూ కుంభాభిషేకం ముగియగానే కంకణాలను విప్పి యాగశాల అగ్నిగుండంలో వేసి మొక్కుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మారులు తీరారు. గ్రామంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు అంబళ్ళతో ప్రదర్శనగా ఆలయం వద్ద చేరుకుని అంకాళపరమేశ్వరి అమ్మవారికి పోశారు. సాయంత్రం నుంచి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. అనంతరం మహా కుంభాభిషేకం సందర్భంగా పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పరమశివం, శివకుమార్ నాయుడు, సురుటుపల్లి ధర్మకర్తల మండల సభ్యులు కృష్ణయ్య యాదవ్, మురళి(చికెన్ చిన్న), లోకయ్యరెడ్డి, సునీల్‌జైన్, జగన్నాథంరెడ్డి, ధనశేఖర్, ఆది, కృష్ణ, చైతన్య, తులసి, దయ, దిలీప్, నాగలాపురం ప్రణీత్‌రెడ్డి, కేవీబీ పురం మునస్వామి యాదవ్, తదితరులు శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు కూరపాటి శంకర్‌రెడ్డి తదితరులకు కండువాలు కప్పి తీర్థ ప్రసాదాలు అందించారు. ఇదే తరహాలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు ఏవీఎం బాలాజీరెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, వెంకటేశులు, ఆనందయ్య, ఆది కేశవులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## ప్రకృతిని మానవులకు అందించేదే వేదం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయం లోని గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద ఆదివారం 'వేద సభను' భక్తి శ్రద్దలతో నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదసభను నిర్వహించారు. ఈ సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేదపండితులను రప్పించారు. నాలుగు వేదాలకు సంబంధించి ఎంతో చక్కగా పఠించటమే కాకుండా వాటి అర్థాలను వేదం అంటే ఏమిటో ఎలా ఉద్భవించిందో తిరుపతికి చెందిన ఘనాపాటి దీపక్ శర్మ వివరించారు. ఈ సందర్భంగా వేదానికి పుట్టుక నాశనం ఉండదని తెలిపారు. ప్రకృతి విషయాలను ఆయన చక్కగా వివరించారు. ధర్మం అధర్మం అంటే ఏమిటో చక్కగా వివరించారు. శ్రీకాళహస్తిలో వెలసిన శ్రీకాళహస్తీశ్వరుడు తన సతిని జ్ఞాన ప్రసూనాంబగా వెలసి భక్తులకుజ్ఞానాన్ని అందిస్తున్నారు. ఎలాంటి విద్యలేని క్రిమ కీటకాలకు మోక్షమిచ్చినారన్నారు. శ్రీకాళహస్తీశ్వరుని గురించి ధూర్జటి మహాకవి తన రచనాల్లో వివరించారన్నారు. నేడు వేద సభను నిర్వహించుటకు కారణం ఉత్సవాల సందర్భంగా ఏదైనా తప్పిదాలుంటే లోటు పాట్లు జరిగి ఉంటే నివృత్తిగా నిర్వహించటం ఆనవాయితిగా వస్తుందని దీపక్ శర్మ వివరించారు. అంతేకాక భక్తులకు అనుగ్రహం కోసం అనుగ్రహత కోసం వేద పఠను నిర్వహించటం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా రుగ్వేదం గురించి మహానంది నుంచి వచ్చిన ఘనాపాటి వివరించారుకృష్ణ యజుర్వేజం గురించి విజయవాడకు చెందిన ఘనాపాటి పిఎస్ శర్మ, శుక్ల యజుర్వేజంకు సంబంధించి తిరుపతికి చెందిన వేదపండితులు దీపక్‌శర్మ, సామావేదం గురించి తిరుమలకు సంబంధించిన షణ్ముఖశర్మ అధర్వణ వేదంకు సంబంధించి విజయవాడకు చెందిన భావనారాయణ, అలాగే నాలుగువేదాలకు సంబంధించి వశిష్టశర్మ, శ్రీనివాసశర్మ, త్రినాథ్‌శర్మ, ఆంజనేయ శర్మ, శివప్రసాద్, మారుతీ శర్మ సంగమేశ్వరశర్మ, శ్రీనివాస శర్మ, ఆంజనేయశర్మ, శ్రీవత్స శర్మ, పేరాతి శర్మ, శివకుమార్ శర్మ, హేమంత కృష్ణ విశ్వనాథ్ భట్టు, మల్లికార్జున్‌శర్మ, పవన్ తదితరుల పర్యవేక్షణలో వందలాది మంది వేదపండితులతో వేద పఠనంతో శ్రీకాళహస్తి పట్టణం దద్దరిల్లింది.

**సన్మానం:**

వేదసభలో నాలుగు వేదాలను పఠించిన వేదపండితులతో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఇఓతో పాటు డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓలు విద్యాసాగర్‌రెడ్డి, మోహన్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం, పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్‌లు పాల్గొన్నారు.

## తండ్రి కలను నెరవేర్చిన కూతురు రోజా

**-చెంగయ్య ఆశయానికి ఫలితం -ఎంబిబిఎస్ పూర్తి చేసిన గ్రామపు బిడ్డ**
**-దిన్నపాటి గ్రామానికి గర్వకారణం**



పులిచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: పేద కుటుంబంలో జన్మించిన ఒక యువతి పట్టుదలతో ముందుకు సాగితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలదని పులిచర్ల మండలం, పోశం వారి పల్లి పంచాయితీ, దిన్నపాటి గ్రామానికి చెందిన జి. రోజా నిరూపించింది. జి. చెంగయ్య కుమార్తె రోజా ఎంబిబిఎస్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి డాక్టర్ పట్టా అందుకోవడం గ్రామంలో ఆనందోత్సాహాలను నింపింది. రోజా తండ్రి చెంగయ్య స్వయంగా చిన్ననాటి నుంచే డాక్టర్ కావాలని కలగన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఆ కల నెరవేరలేదు. అయితే తన గ్రామ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఆయన ఆర్ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తూ పేదలకు అవసరమైన ప్రాథమిక వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఆరోగ్య సదుపాయాలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో చెంగయ్య చిన్నపాటి ప్రాథమిక చికిత్సలు అందిస్తున్నారు. తనకు నెరవేరని ఆశయాన్ని తన కుమార్తె ద్వారా సాకారం చేయాలనే సంకల్పంతో చెంగయ్య ఎంతో కష్టపడి రోజాను చదివించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఆమె విద్యాభ్యాసంలో ఎలాంటి ఆటంకం కలగకుండా కుటుంబం కృషి చేసింది. రోజా కూడా తండ్రి ఆశయాన్ని గౌరవిస్తూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఎంబిబిఎస్ పూర్తి చేసి వైద్య పట్టా సాధించింది. డాక్టర్‌గా అవతరించిన రోజా తన తండ్రి కలను నిజం చేయడమే కాకుండా గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. స్వగ్రామ ప్రజలు ఆమెను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టినా ఉన్నత లక్ష్యాలు ఉంటే సాధించగలమని ఆమె విజయగాథ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. గ్రామ ప్రజలు ఆనందంతో రోజాకు శుభాకాంక్షలు తెలియజేస్తూ డాక్టర్‌గా అవతరించడం మా గ్రామానికి గర్వకారణం అని తెలిపారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రోజా ఆకాంక్ష వ్యక్తం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దిన్నపాటి గ్రామంలో ఈ సందర్భంగా అభినందనలు వెల్లువెత్తాయి. పేదరికాన్ని జయించి వైద్య విద్యను పూర్తిచేసిన రోజా విజయగాథ గ్రామీణ యువతకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

## ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు



పుత్తూరు (నగరి), ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : వచ్చే మార్చి 3న మేల్ మరువత్తూరు ఆధ్యాత్మిక గురువులు శ్రీ బంగారు అడిగిలారు 86వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రికార్డు స్థాయిలో ఆదివారం ప్రపంచం లోని 8,674 పూజా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా నగరి పట్టణంలో వెలసిన ఓం శక్తి ఆలయంలో 54 మంది మహిళలతో 1008 కుంకుమార్చన, 108 పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రపంచ శాంతి, భారతదేశ సౌభాగ్యం కోసం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో వున్న పూజా మందిరాల్లో సామూహిక ప్రార్థనలు జరిపినట్టు ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గంగాధరం తెలిపారు. మార్చి 3వ తేదీన మేల్ మరువత్తూరులో 2000 మంది పేదలకు ఉచితంగా వ్యవసాయ ఉపకరణాలు, కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ముందుగా పేరు నమోదు చేసుకున్న వారికే ఈ అవకాశం వుంటుందని స్పష్టం చేశారు. లక్ష మందికి పైగా అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఓం శక్తి మహిళా భక్తులు, ఆలయ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీస్వయంభునేశ్వరాలయం మహా కుంభాభిషేకం





తవణంపల్లె, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభున్వేర కుమార స్వామిం దేవాలయం కుంభాభిషేకం ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అపోలో హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి తన స్వగ్రామమైన అరగొండలో అతి పురాతనమైన ఈ ఆలయాన్ని సుమారు 6 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో జీర్ణోద్దారణ గావించి మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈమేరకు ఈనెల 18 నుండి ఆలయంలో ప్రతాప్.సి.రెడ్డి, సుచరితారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో కుంభాభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చివరిరోజు ఆదివారం ఆలయంలో రుత్వికులు దేవాలయం జీర్ణోద్దారణ, అష్టబంధన సమర్పణ పాంచాహ్నిక మహా కుంభాభిషేకం కార్యక్రమంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు, రుత్వికులు యాగశాలలో గోపూజ, గణపతిపూజ, పుణ్యాహావాచనం, విశేషసంధి యాగశాల పూజ, విశేష ద్రవ్యహోమం, పూజాధి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మంత్ర పుష్పంగ గావించి భక్తులు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త పూర్ణ చంద్రారెడ్డి, సత్యవతి దంపతులు, ప్రతాప్.సి.రెడ్డి కుమార్తెలు ప్రీతా విజయ్‌రెడ్డి, సునీత ద్వారక్‌రెడ్డి, శోభన అనిల్ కామినేని, సంగీత విశే్వశ్వర్‌రెడ్డి, అపోలో ఆస్పత్రుల అడ్వయిజర్ సత్యనారా యణరెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, అపోలో మెడికల్ కాలేజ్ సీఓఓ బాలరాజు, లైసనింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ ఎ.రాజేశ్వరమ్మ, స్థానిక ప్రముఖులు, రుత్వికులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## గుడికి గొడుగైన కాగితపు పూలు



చౌడేపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: గుడి చుట్టూనే కాకుండా పైకి వెళ్ళి గొడుగులా కాగితపు చెట్టు వున్న దృశ్యం "వార్త "కంట పడింది. మండలంలోని పంచాయతీ కేంద్రం వెంగళపల్లి రామాలయానికి తీగజాతి అయిన కాగితపు పూల చెట్టు నీడనిచ్చే గొడుగులా వ్యాపించి ప్రకృతి ప్రియులను ఇట్టే ఆకర్షిస్తోంది. ఆ దారిన వెళ్ళేవారందరూ ఆలయంలో చెట్టునీడన కూర్చొని ఆశ్వాదిస్తున్నారు. వర్షాకాలంలో ఆకులతో వేసవిలో పూలతో నిండుగా వుండే విదేశీ జాతి బౌగెన్‌విల్లా అనే కాగితపు తీగజాతి చెట్టు యేడాది పొడవునా కళకళలాడుతుంటుందని గ్రామస్తులు తెలుపుతున్నారు.

## నేటినుంచే ఇంటర్ పరీక్షలు

**- ఏకాగ్రతతో రాస్తే పరీక్షల్లో విజయం తథ్యం**

కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: భవిష్యత్తుకు బంగారు బాట వేసుకునేందుకు మొదటిమెట్టుగా భావించే ఇంటర్‌మీడియెట్ పరీక్షలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల కోసం వేలాది మంది విద్యార్థులు రేయింబగళ్లు శ్రమించి ఎంతో సాధన చేసి పరీక్షల్లో విజయం సాధించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే ఈ పరీక్షల సమయంలో ముఖ్యంగా విద్యార్థులకు ఉండాల్సింది ఏకాగ్రత. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం ఉంటే విద్యార్థులు సులువుగా లక్ష్యాలను సాధించవచ్చు. ముఖ్యంగా పరీక్ష హాలుకు నిర్ణీత సమయం కంటే అర్ధగంట ముందే చేరుకుని తమకు కేటాయించిన పరీక్ష హాలును సరిచూసుకోవాలి. తమ వెంట విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, అవసరమైన పెన్నులు, స్కెళ్లు, రాత అట్టలు తదితరాలు అందుబాటులో ఉంచుకోవాలి. పరీక్షల హడావుడిలో భోజనాలు తినకుండా పరీక్షలు రాయడం మాత్రం మంచిది కాదు. తగు ఆహారం తీసుకుని మనసును ప్రశాంతంగా ఉంచుకుని పరీక్షలకు హాజరు కావాలి. మొదట ప్రశ్నాపత్రం అందించగా సరి చూసుకోవాలి. ఆన్సర్ షీట్లు ఇవ్వగానే తొలుత హాల్ టికెట్ నెంబర్లు నమోదు చేసుకోవాలి. జవాబులు రాసేముందు ముందుగా తమకు సమాధానాలు బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాసి అనంతరం మిగతా వాటిపై దృష్టి పెట్టవచ్చు. తద్వారా కాసింత ఒత్తిడి తీరుతుంది. చివరగా సమాధాన పత్రాలు ఇన్విజిలేటర్లకు అందించే సమయంలో ప్రశ్నాపత్రాల్లో హాల్ టికెట్ నెంబర్లు, రాసిన సమాధానాలు, బుక్‌లెట్ పేపర్లు తదితరాలు సరిచూసుకోవాలి. ప్రశ్నాపత్రాల్లో గల అన్ని ప్రశ్నలకు సమాధానాలు తెలిసిఉంటే రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. ముఖ్యంగా ప్రశ్నల నెంబర్లు, జవాబులు విధిగా నమోదు చేయాలి. పరీక్షలనే ఫోబియాను విడనాడి ధైర్యంగా ఎదుర్కొంటే ఉత్తమమైన ఫలితాలు సాధించవచ్చు. ఆల్‌ది బెస్ట్ ఇంటర్ విద్యార్థులు.. భవితకు బంగారు బాటవేసేందుకు శ్రీకారం చుట్టండి.

## మౌళిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

**- జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: చిత్తూరు నగర ప్రజల మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ షణ్ముగం కుమార్తె స్వర్గీయ దుర్గ జ్ఞాపకార్థం మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో 40వ డివిజన్ పరిధిలో నిర్మించిన సిమెంటు రోడ్డును ఆదివారం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మాట్లాడుతూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం అవసరమైన మౌళిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ సర్గీయ దుర్గను స్మరించుకుంటూ ఈ రోడ్డును ఆమె జ్ఞాపకార్థం నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చిత్తూరు నగర పరిధిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**-కిక్కిరిసిన క్యూలైన్లు**



కాణిపాకం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం ఆదివారం కూడా భకు ంతల రద్దీ కొనసాగింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని,ఆదివారాలు వారంతపు రోజులు కావడం ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం భారీగా తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో స్వామి దర్శనం కోసం ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు కూడా క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు మూడు నాలుగు గంటల సమయం వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

**CHANGE OF NAME**

I, **Bukke Mallesu Naik**, (Old Name) S/o Late B.Subba Naik, R/o Vandraspalli (Bidiki), Peddapalli (Post), T.Sundupalli (M), YSR Kadapa Dist. A.P, I have changed my name to **BUKKE MALLESH NAIK,** S/o Late B.Subba Naik (New Name).